## క్లుప్తంగా

### నేడు డిగ్రీ కళాశాలలో యోగాపై అవగాహన

**సబ్బవరం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం–2025ను పురస్కరించుకుని యోగాపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకూ నెల రోజుల పాటు కళాశాలలో వివిధ యోగా అధ్యాయన పద్ధతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆసనాలు, ప్రాణాయామం, మెడిటేషన్ ద్వారా ఆరోగ్య సంరక్షణతో పాటు మానసిక ప్రశాంతతను ఏ విధంగా మెరుగుపరచుకోవచ్చనే అంశాలపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ లెక్కల గణేష్, యోగాలో జాతీయ స్థాయి విజేత పండూరి జయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఉత్సాహవంతులైన వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

### సైనికులకు వందనం



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల, నాయకులు

**పెందుర్తి:** ఆపరేషన్ సిందూర్‌లో భారత్ విజయం సాధించడం కోసం ప్రాణాలను అడ్డంపెట్టిన సైనికులకు వందనాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సుజాతనగర్ కూడలి నుంచి చినముషిడివాడ వరకు శుక్రవారం తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయంతో ప్రతి భారతీయుడు గర్వించాడన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, స్థానిక యువత పాల్గొన్నారు.

### బెల్ట్ దుకాణంలో మద్యం పట్టివేత

32 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం, నిందితుడి అరెస్ట్

**పెందుర్తి:** జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని నరవవానిపాలెంలో ఓ మద్యం బెల్ట్ దుకాణంపై పెందుర్తి పోలీసులు దాడి చేశారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నరవవానిపాలెంలో ఓ వ్యక్తి బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే ఆ దుకాణంపై దాడి చేయగా 32 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ బెల్ట్ దుకాణం ఉన్న ప్రాంతం జీవీఎంసీ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోనిదే కావడం గమనార్హం.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పెందుర్తి:** పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద ట్రాక్ దాటుతూ గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ అధికారి అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ట్రాక్‌పై తీవ్ర గాయాలతో ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. మృతుని వయసు 45–50 ఏళ్లు ఉండవచ్చని మారూఫ్ తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్‌లో భద్రపరిచామని.. వివరాలకు 94948 87786 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

### అధ్వాన మురుగు కాలువతో అవస్థలు



వీఎల్ఎన్ పురంలో మురుగు కాలువ దుస్థితి

**పరవాడ:** మండలంలో పి.బోనంగి శివారు వి.ఎల్.ఎన్.పురం గ్రామంలో మురుగు కాలువలు అధ్వానంగా మారడంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పూడికలను తొలగించడానికి పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసు కోవడం లేదని వాపోతున్నారు. గ్రామంలో కాలువలన్నీ చెత్తాచెదారంతో నిండిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. పూడికలతో నిండిన కాలువల కారణంగా దోమల బెడద పెరిగింది. దీంతో ప్రజలు విష జ్వరాలకు గురవుతున్నారు. రాత్రుళ్లు దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పూడికలు తొలగించడానికి అవసరమైన పనిముట్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పారిశుధ్య సిబ్బంది సమాధానమిస్తున్నారన్నారు. మురుగు కాలువ దుస్థితిని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. పారిశుధ్య సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆరోగ్యం.. గుట్కాయ స్వాహా!

కాలక్షేపం, సరదాగా ఈ ఒక్కసారికి.. అనుకుంటూ యువత వ్యసనాల బారిన పడి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఖైనీ, గుట్కా, సిగరెట్లు, పాన్‌మసాలా వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతూ తమతో పాటు, తమ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. ఇందుకు ఆరంభం చిన్నచిన్న కిరాణా, పాన్‌షాపులే. లాభార్జనకు ఆశపడి నిషేధిత గుట్కా, ఖైనీ, సిగరెట్లను విక్రయిస్తూ యువత నాశనానికి కారకులవుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది.



- యథేచ్ఛగా ఖైనీ, గుట్కా, పాన్‌మసాలా విక్రయాలు
- 3 నుంచి 5 రెట్లు ఆదాయం ఆర్జిస్తున్న వ్యాపారులు
- పాన్‌షాపులు, కిరాణా దుకాణాలే విక్రయ కేంద్రాలు
- నిషేధమున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం



విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్న ఖైనీ ప్యాకెట్లు

**పరవాడ:** మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాన్‌షాపుల్లో మత్తు పదార్థాలు విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయి. ఖైనీలు, గుట్కా, పాన్‌మసాలాలపై నిషేధం ఉన్నప్పటికీ దర్జాగా వాటిని విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు సిమెంట్ పనులు చేసే తాపీ మేస్త్రీలు, రోజు కూలీలు గుట్కాలు వెంట లేనిదే పనులకు వెళ్లలేని పరిస్థితి. గుట్కా తింటూ పనులు చేసుకోవడం వీరికి అలవాటుగా మారిపోయింది. 15 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న యువత కూడా ఈ వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారు.

**గుట్టుగా.. హోల్‌సేల్‌గా..**

అనకాపల్లి, గాజువాక ప్రాంతాలకు చెందిన హోల్‌సేల్ వ్యాపారులు ఖైనీ, గుట్కాలను ఒడిశా ప్రాంతం నుంచి గుట్టుగా తీసుకొస్తున్నారు. వీటిని గ్రామీణ ప్రాంతాల్లోని పాన్ షాపులకు రహస్యంగా సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఖైనీ, గుట్కాలకు ధరలు విపరీతంగా పెంచి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం రూ.5కు అటూఇటుగా ఉన్న ఖైనీ/గుట్కా ప్యాకెట్‌ను రూ.15–20 మధ్య అమ్ముతూ భారీగా ఆర్జిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతాలైన ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల ఏరియాల్లో ఉన్న పాన్‌షాపుల్లో వీటి అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

**అనారోగ్యం.. అల్లర్లు**

గుట్కాలో విష పూరిత రసాయనాలు ఉంటాయని తెలిసీ.. అలవాటు పడినవారు వాటికి దూరంకాలేకపోతున్నారు. ఖైనీలు తిని పెదవులు, నోరు పొక్కిపోయి, దంతాల చిగుళ్ల పాడై, క్యాన్సర్ వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నా యువత బేఖాతరు చేస్తోంది. పరవాడ, వాడచీపురుపల్లి, దేశపాత్రునిపాలెం, ముత్యాలమ్మపాలెం ప్రాంతాల్లో గుట్కాలతో పాటు గంజాయికి అలవాటు పడిన కొంత మంది యువతను పోలీసులు ఇటీవల గుర్తించారు. కౌన్సెలింగ్ ఇచ్చి, విడిచిపెట్టేశారు. ఇక్కడ గంజాయి బ్యాచ్‌లు కూడా ఏర్పడి సరుగుడు, జీడితోటలు, ఖాళీగా ఉన్న వెంచర్లను ఆవాసాలు చేసుకుని, విచ్చలవిడిగా మత్తులో జోగుతున్నారు. బొప్పాయి చెట్ల ఆకుల కాడల్ని గంజాయి పీల్చేందుకు ఉపయోగిస్తూ మత్తు పొందుతున్నారు. రోడ్లపై అల్లర్లకు తెగబడుతున్నారు.

**చోద్యం చూస్తున్న అధికారులు**

ఖైనీ, గుట్కా, పాన్‌మసాలాలపై సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. దీంతో చిల్లర దుకాణాల్లో గుట్కాల విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు వీటిని వేకువజాము 4 గంటల నుంచి ఉదయం 7 గంటల్లోపే దుకాణాలకు గుట్టు చప్పుడు కాకుండా చేరవేస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినా.. పోలీసులు ఎందుకో దృష్టి సారించట్లేదు. వీటికి తోడు కూటమి ప్రభుత్వంలో మద్యం బెల్ట్ దుకాణాలు కూడా విచ్చల విడిగా ఏర్పడటంతో యువత దారితప్పేందుకు అవకాశాలు మరింత పెరిగినట్లయ్యాయి. ఇప్పటికైనా పోలీసులు యువత మత్తుబారిన పడకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పోలీసులు నిఘా పెంచాలి



విచ్చల విడిగా సాగుతున్న గుట్కా, మత్తు పదార్థాల అమ్మకాలపై పోలీసులు నిఘా పెంచాలి. ప్రమాదకరమైన గుట్కా, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి. మత్తుకు అలవాటు పడి జీవితాలను **సర్వనాశనం చేసుకుంటున్న యువతను సక్రమ మార్గంలో తీసుకురావడానికి తల్లిదండ్రులు, పోలీసులు కృషి చేయాలి.**

– వవ్వు కోటేశ్వరరావు, దేశపాత్రునిపాలెం

### ఆరోగ్యాలు పాడవుతాయి



**గుట్కాలో పొగాకు, లైమ్, ప్రొపిన్, సింథటిక్ వంటి రసాయనాలు ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తాయి. గుట్కా, ఖైనీ, సిగరెట్ల వల్ల గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, దంతాల చిగుళ్ల పాడవుతాయి. గంజాయి లాంటి మత్తు పదార్థాలు మరింత ప్రమాదకరం. విష పూరిత రసాయనాలు కలిగిన గుట్కాలను తీసుకోవడం మానుకోవాలి.**

– కె.కనకప్పారావు, ప్రభుత్వ వైద్యుడు, వాడచీపురుపల్లి

### గుట్కా విక్రయాలపై కఠిన చర్యలు



అనకాపల్లి, గాజువాక ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు గుట్కాలను సరఫరా చేస్తున్న వ్యాపారులపై దృష్టి సారించాం. త్వరలో వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. చాప కింద నీరులా సాగుతున్న గంజాయి విక్రయాలపై దృష్టిని కేంద్రీకరించాం. గంజాయి బ్యాచ్‌లు అల్లర్లకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించి, సహకరించండి.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

## సబ్బవరం స్టేషన్లో విధుల్లో చేరిన ఐదుగురు సిబ్బంది

**సబ్బవరం:** స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఐదుగురు సిబ్బంది శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా స్టేషన్లోని 12 మంది సిబ్బంది పలు స్టేషన్‌లకు బదిలీపై వెళ్లినట్లు పేర్కొన్నారు. వీరి స్థానంలో పలు స్టేషన్ల నుంచి సబ్బవరం స్టేషన్‌కు బదిలీపై వచ్చారన్నారు. వీరిలో ఐదుగురు శుక్రవారం విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు. ఇందులో కోడూరు స్టేషన్ నుంచి హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు, కొత్తకోట నుంచి పీసీలు సురేష్, శ్రీను, ఎస్.రాయవరం నుంచి శ్యామ్‌సుందర్, చోడవరం నుంచి ఉమెన్ కానిస్టేబుల్ సుభాషిణి విధుల్లో చేరినట్లు వెల్లడించారు. మిగిలిన వారు కూడా త్వరలోనే విధుల్లో చేరతారన్నారు.

## అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత గోవిందరావుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని వడపాలెం గ్రామానికి చెందిన పి.గోవిందరావు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్ అందించారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

## మందుబాబులకు జరిమానా

**పెందుర్తి:** పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఎనిమిది మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.80 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల కంటైనర్ పట్టివేత

తాగునీరు, ఆహారం లేకుండా తరలిస్తున్న 46 ఎద్దుల స్వాధీనం



పశువులతో ఉన్న కంటైనర్‌ను పట్టుకున్న పోలీసులు



ఇరుకుగా ఉన్న కంటైనర్‌లో పశువులు

**పెందుర్తి:** కనీసం తాగునీరు, ఆహారం ఏర్పాటు లేకుండా కంటైనర్‌లో తరలిస్తున్న మూగజీవాలను పెందుర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పార్వతీపురం సంతలో 46 ఎద్దులను కొందరు వ్యక్తులు తక్కువ ధరకు కొనుగోలు చేశారు. వాటిని గాలీవెలుతురు, ఆహారం లేని ఓ కంటైనర్‌లో ఎక్కించారు. అక్కడి నుంచి తమిళనాడుకు తరలిస్తున్న క్రమంలో పెందుర్తి పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తం అయిన పోలీసులు రాంపురం వద్ద కంటైనర్‌ను పట్టుకున్నారు. అందులోని ఎద్దులను కొత్తవలసలోని హెల్ప్ హ్యాండ్స్ యానిమల్స్ సొసైటీకి సంరక్షణ నిమిత్తం అప్పగించినట్లు సీఐ వెల్లడించారు. కంటైనర్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

## సింహగిరిపై ఒడిశా భక్తుల సందడి

- అప్పన్నకు నిత్యకల్యాణం జరిపించిన దాసుడు



వింజామరతో స్వామికి సేవలందిస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, చిత్రంలో అర్చకులు



పాల్గొన్న ఒడిశా భక్తులు

**సింహాచలం:** సింహగిరిపై నిత్యకల్యాణం ప్రాంగణం ఒడిశా భక్తులతో కిటకిటలాడింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిపించిన నిత్యకల్యాణంలో పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు విశేష పూలాలంకరణ చేసి వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ వింజామరతో స్వామికి సేవలందించారు. భక్తులకు స్వామి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రాళ్లు తేలి.. తుప్పలు పెరిగి..

అధ్వానంగా ఎన్టీపీసీ–బొట్టవానిపాలెం రోడ్డు



బొట్టవానిపాలెం రహదారిలో దట్టంగా పెరిగిన కంచె తుప్పలు

**పరవాడ:** ఎన్టీపీసీ–బొట్టవానిపాలెం రహదారిలో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఎన్టీపీసీ మెయిన్ రోడ్డు నుంచి బొట్టవానిపాలెం వరకు ఏర్పాటు చేసిన మెటల్ రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో రోడ్డుకి ఇరువైపులా దట్టంగా ముళ్ల పొదలు పెరగాయి. దీనికి తోడు రాళ్లు తేలిన రోడ్డుపై వాహనదారులు ప్రయాణించేందుకు నరకం చూస్తున్నారు. చీకటిపడితే రహదారిలో విష జంతువులు సంచరించడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధ్వానంగా మారిన రహదారి మీదుగా పొలాల్లో పండించిన ఫలసాయాన్ని ఇళ్లకు తెచ్చుకోవడానికి నానా పాట్లు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అభివృద్ధికి ఎన్నిసార్లు ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకుంటున్నా చర్యలు తీసుకోవట్లేదని ఆక్షేపిస్తున్నారు.

## పేదలకు భారంగా ప్రైవేటు వైద్యం

సీఎంకు ఈఏఎస్ శర్మ లేఖ

**మహారాణిపేట:** ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్‌లు చార్జ్ చేస్తున్న ఫీజులు భరించలేక పేద ప్రజలు అప్పులపాలవుతున్నారని, అటువంటి ప్రైవేట్ సంస్థలపై కఠినమైన నియంత్రణ అవసరమని కేంద్ర ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శి ఈఏఎస్ శర్మ అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలు, శిక్షణ సంస్థలను స్థాపించే దిశలో కావాల్సిన నిధులను రాష్ట్రప్రభుత్వం కేటాయించాలని కోరారు. కేజీహెచ్ విషయంలో గత నెల 24న ఒక లేఖ రాశానని గుర్తు చేశారు. అక్కడి వైద్యులు సామాజిక స్పృహతో సేవలందిస్తున్నప్పటికీ.. సౌకర్యాలు లేకపోవడం కారణంగా ఆస్పత్రి ప్రాంగణంలో రద్దీ విపరీతంగా ఉంటోందన్నారు. దీని వల్ల రోగులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని అందులో ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలు.. ప్రైవేటు ఆస్పత్రులు వసూలు చేసే ఫీజులు, ఇతర ఖర్చులను భరించలేరన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ప్రైవేటు ఆస్పత్రులలో ఉచితంగా సౌకర్యాలు లభించే అవకాశం ఉన్నా.. అందులో అదనంగా ఉండే ఖర్చులు తప్పనిసరి పరిస్థితుల్లో భరించాల్సి వస్తోందన్నారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ పేద ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యాలు అందించడం లేదని తెలిపారు. దీని గురించి చాలా మంది పేదలకు ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియని పరిస్థితి ఉందని, చర్యలు తీసుకోవాలని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కేబుల్ ఆపరేటర్లు

**పరవాడ:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ఇళ్ల పట్టాలు, విద్యుత్ పరమైన సమస్యలుంటే సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రజల నుంచి 105 అర్జీలు అందాయి. అత్యధికంగా రెవెన్యూ, ఇళ్ల పట్టాలు, వీధి దీపాల సమస్యలపై ప్రజలు అర్జీలు పెట్టుకున్నారు. 30 ఏళ్లుగా నివసిస్తున్న తమ ఇళ్లను కూల్చకుండా చూడాలని తానాం గ్రామానికి చెందిన రజక కులస్తులు ప్రాధేయపడ్డారు. ఏపీ ఫైబర్ నెట్ వ్యవస్థను మరింత మెరుగుపర్చేలా చర్యలు చేపట్టాలని మండల ఫైబర్ నెట్ కేబుల్ ఆపరేటర్లు వినతిపత్రం అందించారు. ఫార్మాసిటీలో ముత్యాలమ్మపాలెం మత్స్యకార్మికులకు ఉపాధి కల్పించి, ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత విన్నవించారు. కార్యక్రమంలో భాగంగా రావాడ గ్రామానికి ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, పీఆర్ డీఈ రమణమూర్తి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీలు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదు

**మహారాణిపేట:** జిల్లాలోని ఆర్ఎంపీలు గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు హెచ్చరించారు. గర్భిణులకు ఎవరైనా నాటు వైద్యం చేసినా, ఆర్ఎంపీలు వైద్యం చేసినా, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిఫర్ చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందడం వల్ల మాతా, శిశు మరణాలను నియంత్రించవచ్చని సూచించారు. గర్భిణులు, వారి కుటుంబాలు ఆర్ఎంపీలను ఆశ్రయించి ఇబ్బంది పడవద్దన్నారు.

**రిజిస్ట్రేషన్ తప్పనిసరి..**

విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్, స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం(ఆన్‌లైన్)లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. లేకుంటే అటువంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్ యాజమాన్యాలు http@//clinicalesttact.ap.gov.in ద్వారా, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు https@// pcpndt.ap. gov.in ద్వారా రిజిస్టర్ చేసుకోవలసిందిగా సూచించారు.

## నేడు బీచ్ రోడ్డులో యోగా ఈవెంట్

**మహారాణిపేట:** యోగాంధ్ర వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ఆర్కే బీచ్ రోడ్డులోని శాశ్వత వేదిక వద్ద జిల్లా స్థాయి యోగా ఈవెంట్ జరగనుంది. వచ్చే నెల్లో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నద్ధతలో భాగంగా ఈ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఆ కార్యక్రమానికి ప్రధాని మోదీ రానున్న నేపథ్యంలో ముందుగానే అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. అందులో భాగంగా జరుగుతున్న ఈ ఈవెంట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. యోగాభ్యాసకులు, ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు.

## గెస్ట్ ఫ్యాకల్టీలు అవసరమా..?

ఏయూ హెచ్‌వోడీల సమావేశంలో ఇదే చర్చ

**విశాఖ విద్య:** ఆంధ్రా యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీల అవసరం ఏ మేరకు ఉందనేది మరోమారు చర్చకు దారి తీసింది. ఏయూ క్యాంపస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో శుక్రవారం సమావేశమైన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అంతర్గతంగా జరిగిన సమావేశం కావడంతో వివరాలు గోప్యంగా ఉంచారు. ఈ నెల 28న రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో నిర్వహించే సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరు కావాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఇక్కడి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏయూలో జరిగిన సమావేశానికి ప్రాధాన్యం సంతరించికుంది. వర్సిటీలోని విభాగాల వారీగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు లెక్క తీసిన వీసీ రాజశేఖర్ ఒకింత విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విభాగాల్లో ఇంతమంది అవసరమా..? అని ప్రశ్నిస్తూనే.. వారిలో బోధనా నైపుణ్యత ఎంత ఉందనేది తెలుసుకునేందుకు మరోమారు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పని చేస్తున్న వారిలో అనుభవజ్ఞులను కొనసాగిస్తూనే.. కొత్తగా తీసుకునేందుకు ఎలా ముందుకెళ్లాలనే దానిపై అందరి అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలోని అన్ని విభాగాల్లో కలిపి సుమారుగా 400 వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమందిని పద్ధతి ప్రకారం కాకుండా హెచ్‌వోడీలు తమకు నచ్చిన రీతిలో నియమించేశారనే ఫిర్యాదులు సైతం ఉన్నాయి. దీనిపై ఫోకస్ పెట్టిన ప్రస్తుత వైస్ చాన్సలర్.. విభాగాల్లో ఎంతమంది అవసరం..? ఎవరిని ఉంచాలి..? ఎవరిని తీసేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో కొంతమంది గెస్ట్ ఫ్యాకల్టీలు అప్పుడే లాబీయింగ్‌లను మొదలుపెట్టారు. వీసీపై ఒత్తిడి తీసుకొచ్చి.. తాము కొనసాగేలా పావులు కదుపుతున్నారు.

## నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



పర్యాటకులను రక్షించిన లైఫ్‌గార్డ్స్

**డాబాగార్డెన్స్:** ఆర్కే బీచ్‌లో విషాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు సరదాగా గడిపేందుకు బీచ్‌కు వచ్చారు. వారిలో నలుగురు సముద్రంలో మునిగిపోతూ ఉండగా జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ వెంటనే స్పందించి కాపాడారు. జీవీఎంసీ ఇన్‌చార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు తెలిపిన వివరాలివి. హైదరాబాద్ నుంచి వచ్చిన షబ్బీర్, అబ్బాస్, ఇద్రిస్, హుస్సేన్ అనే యువకులు శుక్రవారం ఉదయం ఆర్కే బీచ్‌లో స్నానానికి దిగారు. అయితే సముద్ర అలల ఉధృతికి వారు నీటిలో మునిగిపోవడం గమనించిన బీచ్ లైఫ్‌గార్డ్స్ ధనరాజు, నవీన్, ఆనంద్, లక్ష్మణరావు, కేపీ వాసు వెంటనే రంగంలోకి దిగారు. నలుగురు యువకులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వారిని పంపించివేశారు.